53)శంకరాభరణం

ప॥ ఇద్దరు జాణలేమీరు యెంచి చూచితే। పొద్దులు గడుపుదురా పొరుగునను॥

చ॥ దిగ్గన సరసమున దిట్టులెన్ని దిట్టినాను। యెగ్గులు వట్టుదురా యింతలోననే।
వెగ్గళించి చనవున వెస మర్మము లంటితే। సిగ్గులు వడుదురా జిగిమించను॥

చ॥ జవ్వనపాయముతోడ సారె సారె జెనకితే। నవ్వులు నవ్వుదురా నట్టనడుమ।
నివ్వటిల్లు సన్నలెల్లా నెట్టుకొన జేసితేను। రవ్వలు సేయుదురా రచ్చలోనను॥

చ॥ సమ్మతించి కాగిళ్ళను సమరతి బెనగితే। బొమ్మల జంకింతురా పూచిపట్టుక।
యిమ్ముల శ్రీవేంకటేశ యిట్టె మీరు గూడితిరి। దొమ్ములు సేయుదురా తోడదోడను॥